క్లుప్తంగా

అర్హులందరికీ ఇళ్ల పట్టాలు



వాడ్రాపల్లిలో రిజిస్ట్రేషన్ పట్టాల పత్రాలు అందజేస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇళ్ల పట్టాలు అందజేస్తున్నామని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు తెలిపారు. వాడ్రాపల్లిలో శుక్రవారం ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తూ ప్రజారంజక పాలన సాగిస్తున్న సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆదరించాలన్నారు. పేదోడి సొంతింటి కల సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం ఎంతో లాభం



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న వెలుగు ఏపీఎం కొండమ్మ

మునగపాక: మండలంలోని చూచుకొండలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.పెంటకోట సత్యనారాయణకు చెందిన పొలంలో జీవామృతం, బ్రహ్మాస్త్రం తయారీ అలాగే లాభాలపై వెలుగు ఏపీఎం కొండమ్మ అవగాహన కల్పించారు. కూరగాయల పెంపకం ద్వారా మెరుగైన ఆదాయం ఆర్జించవచ్చని అలాగే ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలన్నారు. నవధాన్యాల పంటపై రైతులు ఆసక్తి చూపాలన్నారు. రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వెలుగు సీసీలు దేవానంద్,విజయకుమారి,ఉషారాణి, లలిత, నాగమణి,ప్రకాష్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సామ్రాట్ నాటకం



సామ్రాట్ నాటకంలోని సన్నివేశాలు

మునగపాక: మండలంలోని గవర్ల అనకాపల్లిలో ఏర్పాటు చేసిన సాంఘిక నాటకం అందరినీ ఆకట్టుకుంది. మరిడిమాంబ అమ్మవారి పండగ సందర్భంగా స్థానిక కళాకారులతో ప్రదర్శించిన సామ్రాట్ నాటకం అందరినీ అలరించింది. నాటకంలోని నటీనటులు అద్భుతంగా నటించారు. ఈ నాటకాన్ని తిలకించేందుకు కళాభిమానులు పెద్దసంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవ సందర్భంగా ఎస్ఐ పి.ప్రసాదరావు ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు



కోటవురట్లలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

కోటవురట్ల : పల్లెల్లో నీటి ఎద్దడిని నివారించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని ఎంపీపీ శింగంపల్లి అప్పలనాయుడు అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్‌ను శుక్రవారం ప్రారంభించారు. ఎంపీపీ అప్పలనాయుడు జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. సమ్మర్ క్రాస్ ప్రోగ్రామ్ ద్వారా మంచినీటి సమస్య ఉన్న గ్రామాలలో ముందస్తుగా నివారణ చర్యలు తీసుకుంటారన్నారు. మరమ్మతుకు గురైన మోటార్లు, చేతిబోర్లను గ్రామీణ రక్షిత మంచి నీటి సరఫరా విభాగం సిబ్బంది బాగు చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఏవో చంద్రశేఖర్, ఏపీఎం రమణకుమారి, మండల పరిషత్, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య

ఎస్.రాయవరం : రామయ్యపట్నం గ్రామానికి చెందిన యువకుడు గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్టు తుని రైల్వే ఎస్ఐ అబ్దుల్‌మారూఫ్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రైలు పట్టాల పక్కన మృతి చెంది పడి ఉన్న యువకుని వివరాలపై ఆరా తీయగా ఎస్.రాయవరం మండలం రామయ్యపట్నం గ్రామానికి చెందిన చందక శివగణేష్(18)గా గుర్తించామన్నారు. గ్రామంలో ఓ యువతితో ప్రేమలో ఉన్నట్టు తెలుసుకుని, శివగణేష్ తల్లి మందలించడంతో మనస్తాపం చెంది అతను ఆత్మహత్యకు పాల్పడినట్టు చెప్పారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆస్పత్రిలో భద్రపరచినట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

సుపరిపాలనకు గీటురాయి

- జగనన్న పాలనలో ప్రతి ఇంటా సంక్షేమం
- అవినీతికి తావులేకుండా అర్హులందరికీ పథకాలు
- ఎమ్మెల్యే కంబాల జోగులు
- జగనన్న ఇళ్ల లబ్ధిదారులకు పట్టాల పంపిణీ



జగనన్న ఇంటిపట్టా లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు



సమావేశానికి హాజరైన లబ్ధిదారులు, ఆయా గ్రామ నాయకులు

ఎస్.రాయవరం : రాష్ట్రంలో అవినీతి రహిత పరిపాలన చేస్తూ పేద ప్రజలకు సంక్షేమ, అభివృద్ధి అందించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతోందని పాయకరావుపేట సమన్వయకర్త , రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మండల కేంద్రం ఎస్.రాయవరంలో ఇళ్ల పట్టాలు పొందిన లబ్ధిదారులకి, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు శుక్రవారం ఎమ్మెల్యే జోగులు అందించారు. ఈ సందర్భంగా కంబాల జోగులు మాట్లాడుతూ పేదవాడిని ధనికుడిగా చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నిత్యం శ్రమిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో 30 లక్షలకు పైగా లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇప్పుడు ఉచితంగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లు ఇస్తున్నారన్నారు. ఇకపై జగనన్న కాలనీ లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు వచ్చాయన్నారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లతో ఇచ్చిన స్థలం నిర్మాణం చేసుకున్న ఇంటి విలువ పెరగనుందని చెప్పారు. ఇటువంటి సంక్షేమ పథకాలు అందించే సీఎం ఎప్పటికీ దొరకడని వచ్చే ఎన్నికల్లో కూడా సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డి గెలిపించుకుందామన్నారు. దీంతో డాక్యుమెంట్లు పంపిణీ కార్యక్రమం సందడిగా మారింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ జయలక్ష్మి, డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌స్వామి, ఆర్ఐ వినయ్, వీఆర్వోలు, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకార దేవి, జిల్లా పార్టీ కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, లక్కోజు ఆదిమూర్తి, గరగా శ్రీనివాసరావు, రామకృష్ణ, కొమ్ము వరహాలు, కుంచాల అప్పారావు సిగిరెడ్డి అప్పారావు, గొంతిన సత్యనారాయణ, సర్పంచ్‌లు భూపతి అప్పారావు, పాలపర్తి పాపారావు, కొప్పిశెట్టి సత్యం, ఎంపీటీసీలు బాలం సూరిబాబు, బైపా శ్రీనివాసరావు, కేసుబోయిన వెంకటలక్ష్మి, శానాపతి రాము తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ రాజ్యం...జగనన్నతోనే సాధ్యం



గుర్రాజుపేటలో ఎమ్మెల్యే కంబాల జోగులు, పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందును సత్కరిస్తున్న స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్.రాయవరం : వచ్చే ఎన్నికల్లో వలంటీర్లు సైనికుల్లా పనిచేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకోవాలని పాయకరావుపేట సమన్వయకర్త, రాజాం ఎమ్మెల్యే కంబాల జోగులు పిలుపునిచ్చారు. గుర్రాజుపేట, తిమ్మాపురం, చిన గుమ్ములూరు, ఎస్.రాయవరం గ్రామాల్లో ఆయా గ్రామాల పరిధిలో ఉన్న వలంటీర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా వలంటీర్లు నిర్విరామంగా సేవలు అందించి సంక్షేమ పథకాలు చేరవేయడంలో కీలక పాత్ర వహించారన్నారు. పథకాలు అందివ్వడంలో ప్రభుత్వంలో ఏ ఒక్క చిన్న అవినీతి మరక కూడా అంటకుండా చేశారన్నారు. అదే క్రమంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచి పనులను ప్రజలకు గుర్తు చేయాలన్నారు. నిత్యం విధుల్లో ఉన్న వలంటీర్లపై ప్రతిపక్షాలు అప్పుడే దాడులు మొదలు పెట్టారని, మీకు ఎటువంటి బెదిరింపులు వచ్చినా మా వెనుక పేదల పక్షపాతి, మహిళా పక్షపాతి అయిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారని చెప్పాలన్నారు. గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే అభ్యర్థి సమన్వయకర్తను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి గోవిందరావు, జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చోడిపల్లి అప్పన్న , వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీపతిరాజు, మధువర్మ, కొర్ని రాజా రమేష్, చోడిపల్లి కోదండ, గొంతిన సత్యనారాయణ, యల్లపు నాగు, దాట్ల రామరాజు, ఎంపీటీసీలు కేసుబోయిన వెంకటలక్ష్మి, బాలం సూరిబాబు, మండల యూత్ అధ్యక్షుడు నల్లపరాజు వెంకటరాజు, సర్పంచ్‌లు ధూళి శ్రీనివాసరావు, మల్లే లోవరాజు, కోశెట్టి వెంకటరమణ, భూపతి అప్పారావు, కర్రి సత్యనారాయణ, గాడి అప్పల నరసింహ పాల్గొన్నారు.

క్షయ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి



దిమిలిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

రాంబిల్లి : క్షయ వ్యాధిపై అప్రమత్తంగా వుండాలని దిమిలి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.వెంకటేష్ అన్నారు. క్షయ వ్యాధిపై శుక్రవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, వారం రోజులుగా దగ్గు, జ్వరం వుంటే కఫం పరీక్ష చేయించుకోవాలని సూచించారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే పీహెచ్‌సీలో ఉచితంగా మందులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యురాలు శ్రావణి, ఎంపీహెచ్ఈవో ఎస్ఎస్‌వీఎస్ రాజు, టీబీ పర్యవేక్షకులు సత్యన్నారాయణ, రోజా మణి పాల్గొన్నారు.

బాధితులకు మెరుగైన వైద్య సేవలందించాలి



సింబయో కంపెనీ వద్ద సీఐటీయూ నాయకుల ఆందోళన

రాంబిల్లి : సింబయో జనరిక్ ఇండియా ఫార్మా కంపెనీలో ప్రమాదానికి గురైన ముగ్గురు కార్మికులకు మెరుగైన వైద్య సేవలందించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జి. కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సింబయో కంపెనీ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆందోళన నిర్వహించారు. ఇక్కడ జరిగిన ప్రమాదంలో 80 శాతం కాలిపోయి గాయాలపాలైన కార్మికులు ఎ.రాము, కె.నర్సింగరావు, కె. సన్యాసిరావులను ఆదుకోవాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్. రాము, జి.దేముడునాయుడు డిమాండ్ చేశారు.

పంట నమోదు పత్రాలు విధిగా పొందండి

- జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు
- లైనుకొత్తూరులో 1306 మంది రైతులకు పంట ధ్రువపత్రాల పంపిణీ



రైతులకు పంట నమోదు ధ్రువపత్రాలు అందజేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మోహనరావు

యలమంచిలి : రైతులందరూ విధిగా పంట నమోదు ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా రైతు భరోసా కేంద్రాల ద్వారా పొందాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావు అన్నారు.యలమంచిలి మండలం లైనుకొత్తూరు గ్రామం రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం మండలంలో వివిధ పంటలు వేసిన రైతులకు పంట నమోదు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ముఖ్యంగా మినుములు, పెసర, జనుము, పంటలు వేసిన రైతులకు పంట నమోదు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులందరూ గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాల ద్వారా పంట నమోదు పక్రియపై వివరాలు తెలుసుకొని ఆయా పంటలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు పొందడం ద్వారా ప్రభుత్వ పరంగా ఆర్థికంగా చేయూత నందించడానికి ఎంతో ఉపయోగపడుతుందని రైతులందరూ రైతు భరోసా కేంద్రాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పీఎం కిసాన్ నగదు జమ కాని రైతులు వ్యవసాయ సహాయకులను సంప్రదించి వాటిని పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సహాయక సంచాలకులు వసంతకుమారి, వ్యవసాయాధికారులు సరోజిని, మోహనరావు, వ్యవసాయ సహాయకులు దివ్య మండలంలో రైతులు పాల్గొన్నారు.

జగనన్న పాలనలోనే పేదలకు న్యాయం



లబ్ధిదారులకు ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేస్తున్న ఎంపీపీ బోదెపు గోవింద్

యలమంచిలి : జగనన్న ప్రభుత్వంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లు మంజూరయ్యాయని ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. ఆయన శుక్రవారం యలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం,రుక్మిణీపురం గ్రామాల ప్రజలకు జగనన్న ఇళ్ల రిజిస్ట్రేషన్ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ప్రతి ఒక్క పేదవానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా ఇల్లు మంజూరు చేయడం జరిగిందని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో పేదలకు న్యాయం జరిగిందని సొంతింటి కల నెరవేరడంతో ప్రజలందరూ సంతోషంగా మరలా సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని చేయడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ,ప్రజా ప్రతినిధులు , మహిళలు,అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండండి

- నియమావళి పక్కాగా అమలు
- అధికారులతో ఏర్పాట్లపై ఈఆర్వో మనోరమ సమీక్ష



అధికారులతో సమీక్ష జరుపుతున్న ఈఆర్వో మనోరమ

యలమంచిలి రూరల్ : సార్వత్రిక ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించేందుకు నియోజకవర్గ అధికారులంతా సిద్ధంగా ఉండాలని నియోజకవర్గ ఈఆర్వో కె.మనోరమ సూచించారు. శుక్రవారం యలమంచిలి తహసీల్దార్ కార్యాలయంలో నాలుగు మండలాల అధికారులతో ఆమె ఎన్నికల నిర్వహణ, సన్నద్ధతపై సమీక్ష నిర్వహించారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా ఎన్నికల నిర్వహణకు అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. శనివారం కేంద్ర ఎన్నికల సంఘం సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించే అవకాశం ఉండడంతో నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులంతా నియమావళి పక్కాగా అమలు చేయాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో వసతులు, కొత్త ఓటర్ల నమోదు తదితర అంశాలపై ఆమె అధికారులతో చర్చించారు. సమావేశంలో యలమంచిలి, రాంబిల్లి, అచ్యుతాపురం, మునగపాక మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సెక్టోరల్ అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరం



వినియోగదారుల హక్కు చట్టంపై ప్రచారం చేస్తున్న దృశ్యం

మునగపాక : విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కల్పించుకోవాలని సమాచార హక్కు చట్టం క్రియాశీలక ఉద్యమ ప్రధానకర్త బొడ్డేడ జగ్గప్పారావు కోరారు. నాగులాపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో శుక్రవారం ప్రపంచ వినియోగదారుల హక్కు చట్టం దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వస్తు కొనుగోలుకు సంబంధించి తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలన్నారు. నాణ్యత కలిగిన వస్తువులను కొనుగోలు చేయాలన్నారు. ఐఎస్ఐ గుర్తింపు ఉన్న వస్తువుల కొనుగోలుపై దృష్టి సారించాలన్నారు. హైస్కూల్ హెచ్ఎం కె.శంకరరావు, ఇంగ్లిష్ ఉపాధ్యాయులు సత్యనారాయణ, సాంఘిక టీచర్ రాధాదేవి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే అభివృద్ధి



పోతిరెడ్డిపాలెంలో కుళాయిలు ప్రారంభిస్తున్న ఎంపీపీ గోవింద్, వైస్ ఎంపీపీ శేషు

యలమంచిలి : రాష్ట్రంలో ప్రతి గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనే జరిగిందని యలమంచిలి ఎంపీపీ బోదెపు గోవింద్ అన్నారు. శుక్రవారం ఆయన యలమంచిలి మండలం పోతిరెడ్డిపాలెం, రుక్మిణీపురం గ్రామాల్లో జల్‌జీవన్ పథకంలో భాగంగా నిర్మించిన ఇంటింటికీ తాగునీటి కుళాయిలను, సీసీ రోడ్లు, డ్రెయిన్లు వైస్ ఎంపీపీ రాజాన శేషుతో కలిసి ప్రారంభించారు.వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరలా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు.యలమంచిలి వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు పండు, సన్యాసినాయుడు, రాజాన శ్రీను, కాళ్ల త్రినాథ్ పాల్గొన్నారు.

హత్యకేసులో నిందితుల అరెస్టు

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు సమీపంలో కోనవానిపాలెం రోడ్డు జంక్షన్ వద్ద జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. ఈ నెల 3న జాతీయ రహదారికి సమీపంలో ఓ వ్యక్తిని హత్య చేసి రోడ్డు పక్కన పడేసిన సంగతి తెలిసిందే. దీనిపై కేసు నమోదు చేసిన నక్కపల్లి సీఐ అప్పన్న, ఎస్.రాయవరం ఎస్ఐ విభీషణరావు, కోటవురట్ల ఎస్ఐ రమణయ్య దర్యాప్తు ప్రారంభించారు. రెండు వారాల్లోనే హతుడి వివరాలు తెలుసుకుని, నిందితులను పట్టుకున్నట్టు ఎస్ఐ విభీషణరావు తెలిపారు. మృతుడు అంబేద్కర్ కోనసీమ జిల్లా , అంబాజీపేట మండలం, నడుంపూడి గ్రామానికి చెందిన మటపాత్రుని దుర్గాప్రసాద్(36)గా గుర్తించారు. మృతుడు దుర్గాప్రసాద్ కొన్ని సంవత్సరాలుగా పరిసర ప్రాంతాల్లో రైల్వేస్టేషన్‌లో ప్లాస్టిక్ కాగితాలు, ఖాళీ బాటిళ్లు ఏరుకుని అమ్ముకుని జీవనం సాగించేవాడని, అదే వృత్తిలో కొనసాగుతున్న మరో ముగ్గురు వ్యక్తులు, మృతునికి మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో దుర్గా ప్రసాద్‌ను పథకం ప్రకారం మద్యం పట్టించి కత్తితో పొడిచి హత్య చేసినట్టు చెప్పారు. ఈ మేరకు నిందితులను శుక్రవారం చినగుమ్ములూరు రైల్వేస్టేషన్ పరిధిలో పట్టుకుని జ్యూడిషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టు ముందు హాజరుపరిచామన్నారు. హత్య జరిగిన రెండు వారాల్లోనే నిందితులను పట్టుకున్న సీఐ, ఎస్ఐలను జిల్లా ఎస్పీ అభినందించారన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే అభివృద్ధి



గంగాదేవిపేటలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



చూచుకొండలో రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

మునగపాక : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు జరిగాయని ఎమ్మెల్యే యు.వి. రమణమూర్తిరాజు అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మరో అవకాశం ఇవ్వాలన్నారు. గంగాదేవిపేటలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను ఆయన శుక్రవారం ప్రారంభించారు. చూచుకొండలో రైతు భరోసా కేంద్రం ప్రారంభించారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి జరిగిందన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, వైస్ ఎంపీపీ బొజా లక్ష్మీ శ్రీనివాసరావు, సర్పంచ్‌లు భీశెట్టి గంగప్పలనాయుడు, దొడ్డి సూరప్పారావు, ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్ర, ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొడ్డేడ చెల్లయ్యనాయుడు, పార్టీ నేతలు నరసింహనాయుడు, బొడ్డేడ బుజ్జి, చదరం అప్పలనాయుడు, పెంటకోట అప్పలనాయుడు, శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు మంజూరు



ఇళ్ల పట్టా అందజేస్తున్న డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ

మునగపాక: అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ అన్నారు. మునగపాకలో అర్హులైన నిరుపేదలకు శుక్రవారం ఆయన ఇళ్ల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అర్హత ఉంటే చాలు అన్ని రకాల పథకాలు అందుతాయన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సంక్షేమం చేకూరుస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఎంపీపీ మళ్ల జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ,వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,సచివాలయ మండల కన్వీనర్ పొలిమేర గణేష్, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పంటల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



రైతులకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న ఆత్మ పీడీ ఆశాదేవి

మునగపాక : రైతులు యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) పీడీ ఎం.ఆశాదేవి కోరారు. వాడ్రాపల్లిలో శుక్రవారం ఆత్మ ఆధ్వర్యంలో రైతులకు క్షేత్ర పాఠశాల కార్యక్రమంలో భాగంగా పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన పెంచుకోవాలని ఆమె సూచనలు చేశారు. విత్తన శుద్ధి, అలాగే పంటల సాగులో మెలకువలు తీసుకోవాలన్నారు. భూసార పరీక్షలు కూడా చేయడం ద్వారా మంచి ఫలితాలు ఉంటాయన్నారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు మాట్లాడుతూ రైతుల చెంతకు అధికారులు వచ్చి సీజన్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడం సంతోషకరమన్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, డీటీసీకి చెందిన తులసీమణి, డీఆర్సీ ఏఈవో సాయివాణి, వీఏఏ సత్య తులసీ, రైతులు జోగినాయుడు, లక్ష్మణరావు, అప్పారావు, సూరప్పారావు పాల్గొన్నారు.

గ్లకోమాపై అప్రమత్తత అవసరం



గొల్లపేటలో గ్లకోమాపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

కోటవురట్ల : గ్లకోమా(నీటికాసులు) పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎల్‌వి ప్రసాద్ ఐ హాస్పటల్ టెక్నీషియన్ సంధ్య సూచించారు. స్థానిక గొల్లపేటలోని ఎంపీపీ స్కూల్ వద్ద ఎల్‌వి ప్రసాద్ కంటి ఆస్పత్రి వైద్య సిబ్బంది వరల్డ్ గ్లకోమా వీక్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. టెక్నీషియన్ సంధ్య మాట్లాడుతూ గ్లకోమా వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే అంధత్వం వచ్చే ప్రమాదం ఉందన్నారు. ఆదిలోనే వ్యాధి లక్షణాలను గుర్తించి నివారణకు చికిత్స పొందాలని సూచించారు. దృష్టిని కోల్పోవడం, మబ్బు మబ్బుగా కనిపించడం, తరచూ తలనొప్పి రావడం, కళ్లు ఎర్రబడడం, కడుపునొప్పి, వికారంగా ఉండడం, వాంతులు కావడం , కంటిలో నొప్పి రావడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కంటి వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాము, ఆస్పత్రి ఫీల్డ్ ఆఫీసర్ సురేష్, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి ఐవోసీఎల్ సహకారం భేష్

మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి



పొక్లెయిన్‌ను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి

యలమంచిలి : యలమంచిలి పట్టణాభివృద్ధిలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ వారి సహకారం హర్షించతగిన విషయమని మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. ఆమె శుక్రవారం యలమంచిలిలో అచ్యుతాపురంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ పరిశ్రమ యాజమాన్యం వారు అందించిన 30 ప్లస్ చైన్ మౌంటెడ్ జెసిబిని జెండా ఊపి కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యలమంచిలి పట్టణంలో ఉన్న డ్రైయినేజి కాలువల్లో పేరుకుపాయిన పూడిక తీత పనులు చేపట్టి పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి మరింతగా ఉపయోగం కలగనుందన్నారు. శుక్రవారం యలమంచిలి పట్టణంలో యానాద్రి కాలువలో పూడికతీత పనులను ఆమె పర్యవేక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేద్దాం



ఏటికొప్పాకలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి

యలమంచిలి : బాల్య వివాహాలు నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాణి అన్నారు. ఆమె శుక్రవారం యలమంచిలి మండలం ఏటికొప్పాక గ్రామంలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ యుక్తవయస్సులో పెళ్లిళ్లపై అవగాహన అవసరం అని అన్నారు. బాల్యంలోనే వివాహాలు చేయడం ద్వారా అనారోగ్యాల పాలవుతారని, బాల్య వివాహాలు జరగకుండా ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని, బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కరణం రవి, ఎంపీహెచ్‌వో నెహ్రూ, దేవరపల్లి రమణ, వైద్యబృందం సత్యనారాయణ, కె.కృష్ణవేణి, ఎస్.అమ్మాజీ, రాజా, కుమారి, జ్యోతి పాల్గొన్నారు.